ప్రజాశక్తి
శనివారం 27 సెప్టెంబర్ 2025
5
శ్రీ సత్యసాయి

ఉరవకొండ ప్రభుత్వాసుపత్రిలో విషాదం

చిన్నారి మరణంతో రోధిస్తున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్‌లో మరణించిన చిన్నారి అహరున్(ఫైల్ ఫొటో))

- వైద్యచికిత్సలు అందక చిన్నారి మృతి
- ఆసుపత్రి వద్ద తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ఆందోళన

అనంతపురం జిల్లా, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గం కేంద్రం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో విషాద ఘటన చోటు చేసుకుంది. చికిత్స నిమిత్తం వచ్చిన నాలుగేళ్ల బాలుడు ఆసుపత్రిలోనే మరణించాడు. ఆసుపత్రిలో వైద్యులు సకాలంలో వైద్య చికిత్సలు చేయకపోవడం వల్లనే తమ కుమారుడు మరణించాడంటూ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. వజ్రకరూరు మండలం చాబాలకు గ్రామానికి చెందిన రాజేష్, సరిత దంపతుల కుమారుడు అహరున్(5) గురువారం రాత్రి జ్వరంతో చికిత్స నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. శుక్రవారం ఉదయానికి బాలుడు ఆసుపత్రిలోనే మరణించాడు. అక్కడి వైద్యులు సకాలంలో చికిత్సలు అందించకనే తమ కుమారుడు మరణించాడని తల్లిదండ్రులు కన్నీటి పర్యవంతం అయ్యారు.

వార్త మెయిన్‌లో

అన్నదాతకు 'సుఖీభవ' కష్టాలు..!

- తెరుచుకోని గ్రీవెన్స్ మాడ్యుల్
- పడని వారు ఎక్కడకెళ్లి అడగాలో తెలియని అయోమయం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అన్నతదాత సుఖీభవ కష్టాలు తొలగడం లేదు. ఆగస్టు రెండవ తేది నుంచి రైతుల ఖాతాల్లో మొదటి విడత అన్నదాత సుఖీభవ డబ్బులు వేయడం ఆరంభించారు. అనంతపురం జిల్లాలో 2.74 లక్షల మందికి రూ.191.9 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు డబ్బులు పడని వారి సంఖ్య గణనీయంగా ఉండటం గమనార్హం. పడని వారు తిరిగి దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి డబ్బులు వేస్తామని ప్రభుత్వం చెబుతోంది. అందుకు సంబంధించిన గ్రీవెన్స్ మాడ్యూల్ క్లోజ్ అయ్యింది. దీంతో రాని వారు ఎవరికెళ్లి సంప్రదించాలో కూడా తెలియని పరిస్థితి ఉంది. వ్యవసాయ శాఖ కార్యాలయం వద్దకెళ్తే సచివాలయంలోనే అంటున్నారు. సచివాలయానికి వెళ్తే వ్యవసాయ శాఖ కార్యాలయం అని చెబుతున్నారు. రెండు దగ్గర్లకెళ్లినా ఫలితం ఉండటం లేదు.

అనంతపురం జిల్లాలో అన్నదాత సుఖీభవ కింద 2.74 లక్షల మంది లబ్ధిదారులున్నట్టు అధికారిక రికార్డులు చెబుతున్నాయి. ఇందులో చాలా మందికి పడినప్పటికీ పడని వారు కూడా అదే మోతాదులోనున్నట్టు తెలుస్తోంది. ఆన్‌లైన్ విధానంలో డబ్బులు పడే ఎన్‌పిసిఐ విధానంలో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమవుతాయి. ఈ రకంగా ఎన్‌పిసిఐలో మంజూరై డబ్బులు పడని లబ్ధిదారులు నాలుగు వేల మంది వరకున్నట్టు సమాచారం. ఇక 20,946 మంది జివిఎస్‌డబ్ల్యు సర్వే పూర్తయ్యి, హౌస్ మ్యాపింగ్ ముగిసింది. అయినా డబ్బులు మాత్రం పడలేదు. వీరే కాకుండా వివిధ కారణాలతో ఇంకా డబ్బులు జమవని లబ్ధిదారులు లక్షకుపైగా ఉండటం గమనార్హం.

ఆగస్టు 20 నాటికే గ్రీవెన్స్ మాడ్యుల్ క్లోజ్

అన్నదాత సుఖీభవకు సంబంధించి ఆగస్టు 20వ తేది నాటికే గ్రీవెన్స్ మాడ్యుల్ క్లోజ్ అయింది. లబ్ధిదారులకు అన్నదాత మంజూరులో సమస్య వస్తే వాటిని సరిచేసేందుకు వీల్లేకుండా ఉంది. కార్యాలయాల వద్దకెళుతున్నా వారు కూడా ఏమి చేయలేకపోతున్నారు. ప్రభుత్వం గ్రీవెన్స్ మాడ్యూల్‌ను ఓపెన్ చేస్తే అందులో లబ్ధిదారుల విజ్ఞాపనలను పెట్టి సరిచేయడానికి వీలుంటుంది. అది లేకపోవడంతో సమస్యలు ఎక్కడిక్కడే ఉంటున్నాయి. ఇటీవల జిల్లాలో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ ఈ అంశం చర్చకు రావడం గమనార్హం.

అన్నదాత సుఖీభవ అందరికీ వర్తింపజేయాలి
చంద్రశేఖర్‌రెడ్డి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

అన్నదాత సుఖీభవను రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడత ఆగస్టు రెండవ తేదీన ఆరంభించింది. ఇప్పటికీ చాలా మంది రైతులకు డబ్బులు వారి ఖాతాల్లో జమవలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి సమస్యలున్న వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేకంగా గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేయాలి. లబ్ధిదారుల నుంచి ఆర్జీలు తీసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.శ్యాంప్రసాద్

'అంగన్వాడీ'ల పనితీరు మెరుగవ్వాలి

కలెక్టర్ ఎం.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

అంగన్వాడీల పనితీరు మెరుగుపరుచుకుని ప్రగతి సాధించి జిల్లాను అగ్రగామిగా నిలపాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాడు కలెక్టరేట్లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పురోగతిపై సమీక్షించారు. మొదట ఐసిడిఎస్ పీడీ ప్రమీల పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆ శాఖ ప్రగతిని కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతినెలా అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టిక ఆహారాన్ని పిల్లలు, గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సంబంధిత అధికారులు తరచూ అంగనవాడీ కేంద్రాలను సందర్శించి అక్కడి పరిస్థితిని అంచనా వేయాలన్నారు. ఈ సమావేశంలో సిడిపిఒలు నాగమల్లేశ్వరి, రాధిక, జయంతి, శాంత లక్ష్మి, ధనలక్ష్మి, కవిత, గీతా బాయి, చిన్నపిల్లల సంరక్షణ అధికారి మహేష్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

28న రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ

కదిరి టౌన్ : కేంద్ర ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని అమలు చేయకుండా మనువాద రాజ్యాంగాన్ని అమలు చేయాలని చూస్తోందని మాల మహానాడు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కొప్పల రామచంద్ర విమర్శించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 28న కదిరి పట్టణంలో నిర్వహించే రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీలో ప్రజాస్వామ్యవాదులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర పాలకులు ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించి తద్వారా చీలిక తీసుకురావాలని చూస్తోందని విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని తుంగలోతొక్కి మనువాద రాజ్యాంగాన్ని అమలుచేయాలని కుట్ర పన్నుతోందని ఆరోపించారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- గంజాయి రహిత జిల్లాగా మారుస్తాం
- అక్రమ మద్యం ,పేకాట, అధిక వడ్డీ వ్యాపారంపై నిఘా
- ఎస్పీ ఎస్.సతీష్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

శాంతిభద్రతలకు విఘాతం కలిస్తూ, తప్పుడు పనులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాంటి వారు పోలీసులను చూసి భయపడేలా విధులు నిర్వహించాలని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నాడు హిందూపురం వన్ టౌన్, అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసెప్షన్, లాకప్ గదులు, మహిళ హెల్ప్ డెస్క్, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. రికార్డులు, పాత పెండింగ్ కేసులపై ఆరా తీశారు. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం, డ్రోన్ల సాయంతో రాత్రి వేళల్లో నిరంతర గస్తీ కొనసాగుతుందన్నారు. రానున్న స్థానిక ఎన్నికలపై దృష్టి సారించడంతో పాటు పాత నేరస్తులు, రౌడీషీటర్స్‌ను బైండోవర్ చేయడంతో పాటు ఎక్కువ కేసులు ఉన్న వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామన్నారు. జిల్లాలో గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అధిక వడ్డీ వ్యాపారం, భూ కబ్జాలు, చీటింగ్ చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సిబ్బంది కొరత ఉన్న పోలీస్ స్టేషన్లో త్వరలోనే సిబ్బందిని ఏర్పాటు చేసే విధంగా చూస్తామన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాలు నివారిస్తామన్నారు. న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు స్నేహపూర్వకంగా మాట్లాడి వారి సమస్యకు పరిష్కారం చూపుతామని వివరించారు. ఈ సమావేశంలో డీఎస్పీ కెవి.మహేష్, సిఐలు ఆంజనేయులు, అబ్దుల్ కరీం, జనార్ధన్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిగి చెరువులో ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - పరిగి

ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే రెండవ అతిపెద్ద చెరువు అయిన పరిగి చెరువు ఆక్రమణదారులకు అడ్డాగా నిలిచిందని వీటిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు ట్యాంక్ బండ్ ఏరియాలో చెరువును పూడ్చివేస్తూ నిర్మాణాలు చేపడుతున్నారని వీటిని వెంటనే అధికారులు ఆపించాలని కోరుతున్నారు. సుమారు 3వేల ఎకరాలకు పైగా ఉన్న ఈ చెరువు ఇప్పటికే 100 ఎకరాలకు పైగా ఆక్రమణదారులకు అడ్డగా ఉందని మరింత ఆక్రమిస్తే రానున్న రోజుల్లో చెరువుకు వచ్చే నీరు తగ్గిపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్త చేస్తున్నారు. ట్యాంక్ బండ్ ఏరియాలో నిర్మాణాలే కాకుండా ఉపాధి పేరుతో బంకులు ఏర్పాటు చేసుకుని ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ ఆక్రమణలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోకపోగా అవసరమైతే మీరు కూడా నాలుగు బంకులు వేసుకోండి అని అక్రమ దారులకు వత్తాసు పలకడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నిస్తున్నారు.కొంతమంది అధికారులు సైతం ఆక్రమణదారులతో కొంత నగదు తీసుకొని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఈ విషయంపై విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు నరసింహమూర్తి వేణుగోపాల్ రామదాసు తదితరులు కోరుతున్నారు.

చెరువును పూడ్చి నిర్మాణాలు చేస్తున్న దృశ్యం

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-హిందూపురం

ప్రట్టణంలోని పలు వార్డుల్లో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. హిందూపురం పట్టణంలో శ్రీకంఠాపురం, లక్ష్మీపురం, మోడల్ కాలనీ కంసల పేట మరియు ధర్మపురం నందు ఏర్పాటు చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుతం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులు తీసుకొని రావడానికి చాలా సులువుగా ఉంటుందని, స్మార్ట్ రేషన్ కార్డులో క్యూ ఆర్ కోడ్ ఉండడం వలన ఎటువంటి మోసాలు చేసే అవకాశం లేదని, ఈ కార్డుని జాగ్రతగా పెట్టుకోవాలని తెలియజేశారు. ప్రజలు అన్ని విధాలా సుఖంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, కౌన్సిలర్లు గిరీష్ కుమార్, దుర్గా మంజుల, అంజలి రెడ్డి, రహమత్ బీ, మినిస్ట్రీ ఆఫ్ సెంట్రల్ సీడ్స్ డైరెక్టర్ రమేష్ రెడ్డి, రాష్ట్ర కురుబ కార్పోరేషన్ డైరెక్టర్ పరిమళ, టీడీపీ నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పిహెచ్‌సి భవనం

ప్రజాశక్తి - ఓబుళ దేవర చెరువు

మండల పరిధిలోని గౌనిపల్లి ఆరోగ్య ఉపకేంద్రం భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఆరోగ్య ఉపకేంద్రం చుట్టుపక్కల చెట్లు చెత్త పేరుకుపోయింది. భవనం లోపలి భాగంలో పైకప్పు పెచ్చులు ఊడి పడిపోతున్నాయి. కనీసం నీటి సౌకర్యం కూడా లేదు. దీంతో ఇక్కడ పనిచేయడానికి సిబ్బంది భయపడుతున్నారు. సంబందిత అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన భవనం స్థానంలో నూతన భవనం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

నల్లమాడ ఎంపిడిఒగా శ్రీనివాసులు

నల్లమాడ : నల్లమాడ ఎంపిడిఒగా శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఎంపిడిఒను స్థానిక టిడిపి నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ అందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శంకర్, డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, కోట్లో మంజూ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మంజునాథ్ రెడ్డి, అరవింద్ బాబు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వైద్యశిబిరం

ప్రజాశక్తి మడకశిర టౌన్

స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మడకశిర నగర పంచాయతీలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ నరసింహ రాజు, మున్సిపల్ కమిషనర్ పి జగన్నాథ్ పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూకార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో హెల్త్, శానిటేషన్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ సురేష్ కోరారు. పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్, డెంటల్ స్పెషలిస్ట్ డాక్టరు మల్లికార్జున వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎఎన్ఎంలు, సిబ్బంది శ్రీనివాసులు, సునీత, మల్లేష్ పాల్గొన్నారు.

హోటళ్లలో అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల కేంద్రం, కొడికొండ చెక్ పోస్ట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి గణేష్ బాబు నేతృత్వంలో హోటళ్ళ,చికెన్ షాప్‌లపై దాడులు నిర్వహించారు. ప్రజలు, వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు అధికారులు చెప్పారు. లైసెన్స్ లేకుండా షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో భాగంగా చికెన్ షాప్‌ను పరిశీలించిన అధికారులు చికెన్ కబాబ్‌కు వాడుతున్న రంగులను చూసి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి కలర్లను వాడకూడదని హెచ్చరించారు. చికెన్ సెంటర్లలో కబాబ్ కోసం మరగబెట్టిన నూనెను పదే పదే వాడడంతో క్యాన్సర్ వస్తుందని, ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే కేసులు నమోదు చేసి సీజ్ చేస్తామన్నారు. పలు చికెన్ సెంటర్ల యజమానులకు నోటీసులు జారీ చేశామని అధికారులు చెప్పారు.

చికెన్ కబాబ్‌కు వాడే కలర్‌ను చూస్తున్న అధికారి

పురాతన శాసనాన్ని చూపుతున్న చరిత్రకారులు

పురాతన ఆలయంలో శాసనాల గుర్తింపు

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల పరిధిలోని పాత దేవరపల్లిలో ఉన్న పురాతన చెన్నకేశవ స్వామి దేవాలయంలో పురాతన శాసనాలను చరిత్రకారులు రిటైర్డ్ హెచ్‌ఎం వెంకన్న, గోపి గుర్తించారు. శుక్రవారం ఆలయాన్ని వారు సందర్శించి రాతి బండ పైన ఉన్న నాలుగు శాసనాలను గుర్తించారు. 11వ శతాబ్దంలో కోయసల రాజు విష్ణువర్ధన కాలంలో ఈ ఆలయాన్ని నిర్మించినట్లు 1511 వ సంవత్సరంలో శ్రీకృష్ణదేవరాయల కాలంలో రాసిన ఈ శాసనాల ద్వారా తెలుస్తోందన్నారు. ఈ ఆలయ అభివృద్ధికి 125 ఎకరాల భూమిని అప్పట్లో కేటాయించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి మాధవయ్య, గ్రామస్తులు మారుతి, కుమార్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

లేపాక్షి : మండలంలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ నత్తనడకనసాగుతోంది. మండలంలో 14983 రేషన్ కార్డులుండగా శుక్రవారం నాటికి 1264 రేషన్ కార్డు లు మాత్రమే పంపిణీ చేశారు. మూడు రోజులు కావస్తున్న ఇప్పటి వరకు మైదుగోళం, సిరివరం,కొండూరు పంచాయతీ లలోని ప్రభుత్వం చౌకధాన్యపు పరిధిలో కేవలం రెండు, నాలుగు, ఐదు రేషన్ కార్డు లను మాత్రమే లబ్ధిదారులకు అందజేశారు. అధికారులు మాత్రం సకాలంలో లబ్ధిదారులందరికి స్మార్ట్ కార్డు లు అందించాలని సంకల్పిస్తే మైదుగోళం గ్రామం లోని డీలర్ ఒకే పంచాయతీ అయినప్పటికీ కార్డుల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తున్నాడని స్థానికులు విమర్శిస్తున్నారు.

వడ్డెర్లకు రాయల్టీలో మినహాయింపు ఇవ్వండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో చాలామంది వడ్డెర కులస్తులు నిరుపేదలుగా ఉన్నారని వీరికి రాయల్టీలో మినహాయింపు ఇవ్వాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం జరిగిన శాసనసభ సమావేశంలో వడ్డెర్ల సమస్యలపై అసెంబ్లీలో ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్‌టి రామారావు వడ్డెర్లకు రాయల్టీని పూర్తిగా మినహాయించారని గుర్తు చేశారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఒక్కొక్క ట్రాక్టర్ పై రూ.1000 రూపాయలు రాయల్టీని విధించారని ప్రస్తావించారు. వడ్డెర్లు రోజంతా పనిచేస్తే వెయ్యి రూపాయలు మాత్రమే కూలి వస్తుందని ఈ రాయల్టీ విధించడం వల్ల వారికి వచ్చే కూలి ఏమాత్రం మిగలకుండా వారి కుటుంబ పోషణకు చాలా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి వడ్డెర్ల జీవనభృతికి అడ్డంకిగా మారిన రాయల్టీని మినహాయింపు ఇవ్వాలని ఆమె కోరారు.

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వడ్డెర సమస్యలను ప్రస్తావించడంపై హర్షం : వడ్డెర్ల సమస్యలను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించడం పట్ల. రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ వలిపి శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిరుపేదలుగా ఎంతోమంది వడ్డేర్లు ఉన్నారని వారు రాళ్లు కొట్టుకునే కుటుంబాలను పోషించుకుంటున్నారని చెప్పారు.రియాల్టీలు వసూలు చేయడం ప్రభుత్వం ఆపేయాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించారని. వాటిని తక్షణమే అమలు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వడ్డెర్ల వెంకటేశు, పెద్దన్న, శివయ్య, బాలాజీ, వెంకటేష్ ,తులసమ్మ, నాగమణి ,కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

మడకశిరకు చేరిన కృష్ణమ్మ

ప్రజాశక్తి - మడకశిర టౌన్

మడకశిరకు కృష్ణాజలాలు చేరాయి. గత మూడు సంవత్సరాలనుండి హంద్రీనీవా కృష్ణాజలాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చొరవతో మడకశిర నియోజకవర్గం సి. కొడిగేపల్లికి హంద్రీ నీవా కృష్ణాజలాలు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సకాలం లో వర్షాలు లేక రైతులు తీవ్రంగా నష్ట పోయారు. తాగునీటికి కూడా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ ఏడాది ఎలాగైనా అమరాపురం వరకు కృష్ణా జలాలు తీసుకెళ్లాలని స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పట్టుబట్టి నీటిని తీసుకొని వస్తున్నారు. అమరాపురంలో జలహారతి కార్యక్రమానికి ముఖ్యమంత్రిని కూడా ఆహ్వానించారు. రెండు నెలలుగా అధికారులతో వరుస సమావేశాలు ఏర్పాటు చేస్తూ కాలువలో చెట్లను తొలగింపజేయించారు. దీంతో కాలువలో కృష్ణాజలాలు పరుగుపెడుతున్నాయి.

కాలువ ద్వారా వస్తున్న కృష్ణాజలాలు

నేటి నుంచి టీ- 20 క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - మడకశిర టౌన్

గాంధీ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఎమ్మెస్సార్, జిటిఎస్ టి -20 లెదర్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం నుండి నిర్వహిస్తున్నట్లు అభిమన్యు యూత్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ టోర్నమెంట్ 5 రోజులపాటు నిర్వహిస్తున్నారు.. ఫైనల్ మ్యాచ్ 2 వ తేదీన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. విన్నర్స్ జట్టుకు 30వేల రూపాయలు, రన్నర్స్ జట్టుకు 20 వేల రూపాయల నగదు తో పాటు ట్రోఫీలను అందజేస్తారని తెలిపారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని రొప్పాల గ్రామానికి చెందిన టిడిపి మాజీ కన్వీనర్ నరసింహ మూర్తి తల్లి ముద్దమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకొన్న తెలుగుదేశం పార్టీ మండల నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు ర్పించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమం లో మండల కన్వీనర్ నరహరి, సీనియర్ నాయకులు మాధవ నాయుడు, వెంకటరామిరెడ్డి, చిన్నప్పయ్య, రొద్దం సింగిల్ విండో అధ్యక్షులు నిరుగంటి వీరాంజి నేయులు, రాము, డీలర్ గోపీ, శంకర్, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ

ప్రజాశక్తి - నల్లమాడ

మండలంలోని వేళ్ళమద్ది, పాత బత్తలపల్లి గ్రామాల్లో 200 మంది రైతులకు యూరియాన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈనెల 30లోపు రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రంగనాయకులు, ఎఒ అబ్దుల్ హక్, సింగిల్ విండో అధ్యక్షుడు రమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పురం' ఎంఇఒకు పురస్కారం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మండల విద్యాశాఖ అధికారి గంగప్పకు మాధురి పురస్కారం లభించింది. శుక్రవారం జాతీయ కవి సమ్మేళనం, సినీ సంగీత విభావరి కార్యక్రమం విజయవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ గంగప్ప విశ్రాంత అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ రత్నం చేతులు మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ కు స్థానిక కళాకారులు శుభాకాంక్షలు తెలిపారు.

బస్ షెల్టర్ నిర్మించండి

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల కేంద్రంలో బస్సు ప్రయాణికుల సౌకర్యార్థం షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. బస్సుకోసం వేచి ఉండాలంటే ఎండలో నిలబడాల్సి వస్తుందని వాపోతున్నారు. పేరుకు మండల కేంద్రమైనా ఇక్కడ ప్రయాణికుల కోసం బస్సు షెల్టర్ లేదని విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - హిందూపురం రూరల్

రూరల్ పరిధిలోని బేవినహళ్లి పంచాయతీ పరిధిలోని ఊడుగులపల్లి, సంజీవరాయన పల్లి, నక్కల పల్లి ఆయా గ్రామాలలో రేషన్ దుకాణాలలోని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు శుక్రవారం బేవినహల్లి ఆనంద్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ కార్డులో ఉన్నటువంటి క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే కుటుంబ సభ్యుల వివరాలు తెలిసేలా ప్రభుత్వం కార్డును సులభం తరం చేసిందని దీనివల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అశ్వినితోపాటు డీలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సోమందేపల్లి :మండల కేంద్రంలోని వినాయక నగర్ మారుతీ నగర్ తదితర ప్రాంతాల్లో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన స్మార్ట్ రేషన్ కార్డులను కూటమ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పారదర్శకత, అవినీతికి తావు లేకుండా అర్హులకు రేషన్ బియ్యం అందించాలని సదుద్దేశంతో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ వెంకటేష్, టౌన్ కన్వీనర్ వడ్డే సురేష్, సగర రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ వెంకట రాముడు, హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్ర, మాజీ కన్వీనర్ సిద్దలింగప్ప, మాజీ ఎంపిటిసి కిష్టప్ప, జనసేన మండల కన్వీనర్ జబీబుల్లా డీలర్లు పూజారి మురళి, తూముకుంట బాలు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వృత్తి విద్యాభ్యాసం

ప్రజాశక్తి - రొద్దం

విద్యార్థుల వృత్తి విద్యాభ్యాసం కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల కోసం దసరా సెలవుల్లో నిర్వహిస్తున్న ఇంటర్‌షిప్ కార్యక్రమంలో మండలంలోని రొద్దం ప్రభుత్వ హైస్కూల్ నందు చదువుతున్న విద్యార్థులు ఉత్సహంగా పాల్గొన్నారు. అగ్రికల్చరల్, ఆటోమోటివ్ విభాగాల్లో జరుగుతున్న ఈ ఇంటర్నషిప్‌ను ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనాయణమ్మ శుక్రవారం సందర్శించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమం వల్ల విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, నైపుణ్యం పెరుగుతుందని అన్నారు.

పంటపొలాల పరిశీలన

ప్రజాశక్తి - గుడిబండ

మండలంలోని మోర్ బాగల్ గ్రామంలోని కెవికె కేంద్రం, ఏరువాక కేంద్రం, జిల్లా వనరుల కేంద్రం అధికారులు మండలంలోని వేరుశనగ, మొక్కజొన్న, పత్తి, మిరప పంటలను పరిశీలించారని వ్యవసాయ అధికారి వీర నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు ఆయన చెప్పారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణానికి చెందిన ఎస్.మదిహాను సువర్ణ భారతి జూనియర్ కళాశాలలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. మదిహాకు నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరం ఆఫ్ ఆర్టిస్ట్, యాక్టివిస్ట్ సంస్థ అవార్డును అందజేసి సన్మానించింది. చిన్న వయసులోనే ఉత్తమ సేవలను అందిస్తున్న ఆమెను గుర్తించి ఈ అవార్డును అందజేశారు. మదిహా గత 2021-23 వ సంవత్సరంలో సువర్ణ భారతి కళాశాలలో ఇంటర్మీడియట్ చదివింది. ఈ సందర్భంగా సువర్ణ భారతి కళాశాల యాజమాన్యం విద్యార్థిని, తండ్రి జాకీర్ అహమ్మద్ ను సన్మానించింది. ఈ కార్యక్రమంలో సువర్ణభారతి కళాశాలల చైర్మన్ నీలకంఠ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థితో పాటు తండ్రిని సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ నీలకంఠా రెడ్డి తదితరులు

సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ధర్నా

ప్రజాశక్తి - గాండ్లపెంట

విద్యుత్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సోమయాజులపల్లి సచివాలయం పరిధిలోని రైతులు స్థానిక సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు నెలరోజుల నుంచి కరెంటు సరఫరా సరిగా లేకపోవడంతో పంటలకు నీరందించలేక పోతున్నామన్నారు. అలాగే తాగునీటి సమస్య కూడా ఉందన్నారు. సమస్యను పలుసార్లు ట్రాన్స్‌కో అధికారులకు తెలిపిన వారు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన ట్రాన్స్కో ఏడి ఎల్ వరప్రసాద్ రెడ్డి ఫోన్లో రైతులో మాట్లాడారు. లైన్ మాన్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మహేశ్వర్ రెడ్డి, సుమంత్ రెడ్డి, కేకే రామ్మోహన్ రెడ్డి, శివారెడ్డి, రియాజ్, హైదరవలి, మదర్ వలితో పాటు దాదాపు 200 మంది రైతులు తదితరులు పాల్గొన్నారు

ఆందోళనలో రైతులు, గ్రామస్తులు

పిహెచ్‌సి వైద్యుల సమ్మెబాట

డిఎంహెచ్ఒకు నోటీసు ఇస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని పరిగి, ఊటకూరు పీహెచ్సీ వైద్యులు శుక్రవారం నుండి సమ్మె బాట పట్టినట్లు వైద్యులు స్వరూపరెడ్డి, సురేష్ తెలిపారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. జీవో 99 ద్వారా కోత విధించిన ఇన్ సర్వీస్ పీ జీ కోటా పునరుద్ధరణ చేయాలని, సమయ నిర్ధారితమైన ప్రమోషన్స్ తో పాటు,ట్రైబల్ అలవెన్సు, 104 సంచార చికిత్స అలవెన్సు కల్పించాలని కోరారు. నొషనల్ ఇంక్రిమెంట్ వంటి డిమాండ్ల ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తు శుక్రవారం డిఎంహెచ్వో కు నోటీసులు ఇచ్చినట్లు వైద్యులు తెలిపారు. 26 నుండి సమ్మెలో ఉంటామని ప్రజలు తమకు మద్దతు ఇవ్వాలని వారు కోరారు. ప్రధానంగా 26 నుండి ఆన్లైన్ రిపోర్టింగ్ సేవలు బంద్ చేసి, 27 న స్వచ్ఛ నారీ కార్యక్రమం,104 సంచార చికిత్స సేవలు నిలుపుదల చేస్తున్నట్లు వారు తెలిపారు. 28న అధికారిక వాట్సప్ గ్రూప్ బహిష్కరణ చేస్తామని,29 న అన్నిప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓపీ సేవలు బంద్ చేస్తున్నట్లు వెల్లడించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే 30న తమ డిమాండ్ల పరిష్కారం కోసం జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.అక్టోబర్ 1న జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ, ప్రదర్శనలు చేసి 3 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వైద్యాధికారులు విజయవాడ లో నిరసన, నిరవధిక నిరాహార దీక్షలు చేయనున్నట్లు వారు వెల్లడించారు.

ఎఫ్‌సిఆర్‌ఎపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదల కోసం ఎన్నో సేవలు చేస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎ దక్కేలా అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీలో ఉమ్మడి జిల్లాల 14 మంది శాసనసభ్యులు ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎ అందించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి తో చర్చించి వెంటనే తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలన్నారు. ఆర్డీటీ పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కక్షసాధింపు చర్యలకు దిగడం తగదని మండిపడ్డారు. ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేలు ఈ విషయంపై ముఖ్యమంత్రి తో చర్చించకపోతే ఉమ్మడి జిల్లాలోని అందరి ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జైభీమ్ పార్టీ నాయకులు ఊటుకూరు నాగరాజు, మూర్తి, ఎమ్మార్పీఎస్ నాయకులు నాగరాజు, నాగార్జున, కదిరప్ప, రవి తదితరులు పాల్గొన్నారు

నీటి తొట్టెలో పడి చిన్నారి మృతి

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని ఊటకూరు ఎస్సీ కాలనీలో నీటి తొట్టెలో పడి మూడేళ్ల చిన్నారి మహేంద్రసింగ్ ధోని (3) మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఈశ్వరప్ప, శిల్ప అనే దంపతులు దిన కూలి చేసుకుంటూ జీవనోపాధి పొందేవారు. అయితే మధ్యాహ్న సమయంలో తల్లి శిల్ప ఇంట్లో పని చేసుకుంటుండగా ఇంటిముందున్న ప్లాస్టిక్ పేపర్‌తో కప్పబడిన నీటి తొట్టెలో మూడేళ్ల చిన్నారి పడిపోయాడు. కొద్దిసేపటి తర్వాత శిల్ప తన కుమారుడిని గమనించి చూడగా విగత జీవిగా నీటి తొట్టెలో కన్పించాడు. ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు ఇలా మృతిచెందడంతో వారు చేస్తున్న రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి.

చిన్నారి (ఫైల్‌ఫొటో)

ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్

ఖైదీలతో వివరాలు తెలుసుకుంటున్న డిఎల్ఎస్ఎ కార్యదర్శి రాజశేఖర్

ప్రజాశక్తి-హిందూపురం

తప్పులు చేసి కారాగారాలకు వచ్చిన ఖైదీల పట్ల నిర్లక్ష్యం చేయకుండా వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రాజశేఖర్ సూచించారు. శుక్రవారం స్థానిక ఉపకారాగారాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపకారాగార అధికారి హనుమప్పను ప్రస్తుతం సబ్ జైలులో ఉన్న ఖైదీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ జైలు నుండి బయటకు వెళ్లిన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఉపకారాగారంలో క్రమం తప్పకుండా ఖైదీలకు వైద్య పరీక్షలు చేయించాలన్నారు. స్థానికంగా అందుబాటులో లేని వైద్య సేవలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెరుగైన ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించాలన్నారు. అదే విధంగా ఆర్థికంగా వెనుకబడి ఉండి డబ్బులు వెచ్చించి న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని రిమాండ్ ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. అలాంటి రిమాండ్ ఖైదీలు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఆయన ఆహార పదార్థాల తయారీ కోసం పంపిణీ చేసిన నిత్యావసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఆర్ఓ ప్లాంట్, వంటగది తదితర వాటికి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణ వ్యాఖ్యలు వినడానికే సిగ్గుపడుతున్నాం : వైసిపి

ప్రజాశక్తి-హిందూపురం

స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అసెంబ్లీలో మాట్లాడిన వ్యాఖ్యలు వినడానికి సిగ్గుపడుతున్నామని, చట్టసభల్లో ఇలా హిందూపురం ఎమ్మెల్యే మాట్లాడడం హిందూపురం ప్రజలకు తీవ్ర అవమానమని వైసిపి నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసీపీ నాయకులు వేణు రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, కౌన్సిల్ ప్రతిపక్ష నేత ఆసిఫ్ వుల్లా, వైసిపి రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మధుమతి రెడ్డి మాట్లాడారు. అసెంబ్లీలో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని హిందూపురం ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన గౌరవ శాసనసభ్యులు ప్రజా సమస్యలను విస్మరించి ఒక సైకోలా మాట్లాడారని విమర్శించారు. ఎన్టీఆర్ వారసుడిగా ఆయనతో పాటు ఆయన సోదరుల్లో ఏ ఒక్కరైనా ముఖ్యమంత్రిగా గెలిచి చూపించాలని సవాల్ చేశారు. హిందూపురం ప్రాంత ప్రజలు నమ్మి మూడవసారి బాలకృష్ణను గెలిపిస్తే చేసిన అభివృద్ధి ఏదీ అని ప్రశ్నించారు. మంజూరు చేయించిన నిధులను తీసుకురావడానికి చేతకాని వ్యక్తి బాలకృష్ణ అని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా బాలకృష్ణ సైకోల వ్యవహరించడం మానుకొని పురం అభివృద్ధికి పాటుపడాలన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై తులనాటితే ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైసిపి కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

బాలయ్యను విమర్శించే స్థాయి వైసిపికి లేదు : టిడిపి

ప్రజాశక్తి-హిందూపురం

స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అను విమర్శించే స్థాయి వైసిపి నాయకులకు లేదని, బాలకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించే ప్రసక్తే లేదని తెలుగు మహిళలు వైసిపి నాయకుల పై మండిపడ్డారు. వైసిపి నాయకులు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం సాయంత్రం తెలుగు మహిళలు బాలకృష్ణ నివాసం వద్ద విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు రామాంజి నమ్మ, పరిమళ, శ్రీదేవి మాట్లాడుతూ, బాలకృష్ణను ఎమ్మెల్యే అన్న ఇంగిత జ్ఞానం సైతం లేకుండా అసభ్యకరంగా మాట్లాడడం పద్ధతి కాదన్నారు. అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే బాలకృష్ణ సైకో జగన్ అని అనలేదన్నారు. గుమ్మడికాయ దొంగ అంటే భుజాలు తడుముకున్నట్టు ఎందుకు ఊగిపోతున్నారన్నారు. వైసిపి అధికారంలో ఉన్న సమయంలో జగన్మోహన్ రెడ్డిని ప్రజలు సైకోగా పిలిచేవారని, ఆ మాటే బాలకృష్ణ గుర్తు చేశారని అన్నారు. బాలకష్ణ ఎక్కడ ఉన్న హిందూపురం నియోజకవర్గం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. అందువల్లే ఈ ప్రాంత ప్రజలు మూడవసారి సైతం బాలకృష్ణకు పట్టం కట్టారన్నారు. బాలకృష్ణను అనుచితంగా మాట్లాడిన వైసిపి నాయకులు దీపిక, నాగమణిలపై తెలుగు మహిళలు వన్ టౌన్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు జయలక్ష్మి, చెన్నమ్మ, అంజలి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఎంజిఎం ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరంలో మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, డి.ఎమ్. హెచ్.ఓ. డాక్టర్ ఫైరోజా బేగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మునిసిపల్ కార్యాలయంలో పని చేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు, మున్సిపల్ అధికారులకు ఉచితంగా వైద్య పరీక్షల నిమిత్తం ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్య శిబిరం నిర్వహణకు సహకరించిన వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రాఘవేంద్ర, సతీష్ కుమార్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్లు సంధ్య రాణి, జక్కా నరేంద్ర, సుప్రవీణ్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణ పరిధిలోని ఇస్లాపురం సమీపంలో ఉన్న నాగప్ప కుంటలో శుక్రవారం పెనుకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి గోపి నాయక్ ఆధ్వర్యంలో గంబూజియా చేపలను వైద్య సిబ్బంది వదిలారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ దోమల నివారణకు ముందస్తు చర్యల్లో భాగంగా లార్వాదశలోనే నిర్మూలించేందుకు ఈ గంబుషియా చేపలు నీటిలో వదిలామన్నారు. ఈ చేపలు లార్వాలను నాశనం చేస్తాయన్నారు. డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ జ్వరాలు ప్రబలకుండా ఉండేందుకు ఈ చేపలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ గీతా హనుమంతు యాదవ్, ఎంపీహెచ్ఎ జనార్దన్ రెడ్డి, ఎఎన్ఎం గంగమ్మ, ఆశా కార్యకర్తలు గంగా, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది గొర్రెలు మృతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని పోలేపల్లిలో రైతు కురువ మారుతి, అంజినమ్మకు చెందిన 8 గొర్రెలు, ఒక ఆవు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాయి. గురువారం ఎప్పటిలాగే గొర్రెలు ఆవులు మేపుకొని సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో పశువులు పాక దగ్గరికి తీసుకుని వచ్చామని చెప్పారు. ఆసమయంలో బయట బకెట్‌లో ఉన్న నీటిని గొర్రెలు, ఆవు తాగాయని చెప్పారు. అయితే అర్ధరాత్రి సమయంలో చూడగా ఎనిమిది గొర్రెలు, ఆవు మృతిచెందాయని దీంతో తమకు రెండు లక్షల రూపాయల వరకు నష్టం చేకూరిందని బాధితులు మారుతి, అంజనమ్మ కన్నీటి పర్యంతం అయ్యారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ట్రైన్ ఎస్ఐ రాజశేఖర్ సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

నేరాలు ఘోరాలు

ముగ్గురు దొంగలు అరెస్టు.. రూ15.38 లక్షల సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి-పెనుకొండ

ఇళ్లల్లో, రైతు పొలాల వద్ద కేబుల్ వైర్ల దొంగతనానికి పాల్పడిన కేసులో ముగ్గురిని అరెస్టు చేసి రూ 15.38 లక్షల విలువచేసే 132.870, గ్రాముల బంగారు,127.980 గ్రాముల వెండిఆభరణాలు,770 మీటర్ల కేబుల్ వైరు, ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం పెనుకొండ డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ నర్సింగప్పతో కలిసి ఎస్పీ మీడియా సమావేశం ఏర్పాటు చేసి చోరీ కేసువివరాలు వెల్లడించారు. మడకశిర మండలం కల్లుమర్రి పంచాయతీ ఎల్లోటి గ్రామానికి చెందిన విజయ్ కుమార్, పెనుకొండ మండలం మరువపల్లి గ్రామానికి చెందిన నరసింహులు, అదే గ్రామంలో నివాసమున్న మడకశిర మండలం కల్లుమర్రి పంచాయతీ ఎల్లోటి గ్రామానికి చెందిన బోయ నరేష్ కలసి పెనుకొండ, రొద్దం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇళ్ళల్లో బంగారు, వెండి ఆభరణాలను, పొలాల్లో కేబుల్ వైర్లను దొంగతనానికి పాల్పడేవారు . ఈ కేసుల పై పెనుకొండ డీఎస్పీ నర్సింగప్ప పర్యవేక్షణలో, పెనుకొండ సి.ఐ రాఘవన్, పెనుకొండ ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా ఈనెల25న పెనుకొండ సమీపంలో 44 జాతీయ రహదారి ప్రక్కన పుట్టపర్తి క్రాస్ లో ఉన్న అభయ ఆంజనేయ స్వామి గుడి వద్ద ముగ్గురు నిందితులు స్కూటీపై పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. 6 ఇళ్ళ లో దొంగతనాలు, పొలాల్లో కేబుల్ వైర్ల దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో తెలిందే. దీంతో ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి బంగారు, వెండి ఆభరణాలు, 770 మీటర్ల కేబుల్ వైర్లు, దొంగతనాలకు ఉపయోగించిన ఒక స్కూటీ, ఇనుప రాడ్డు, స్క్రూడ్రైవర్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల దర్యాప్తులో నిందితుల అరెస్టు, దొంగతనం సొత్తు రికవరీలో చాకచక్యంగా వ్యవహరించిన పెనుకొండ సిఐ రాఘవన్, పెనుకొండ ఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుళ్ళు నాగరాజు, మారుతి, కానిస్టేబుళ్ల ఆదినారాయణ, సుధాకర్, భూమేష్, హర్షవర్ధన్‌ను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల భద్రతే పోలీసుల లక్ష్యమన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, సొంత ఊరు, ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. జిల్లాలో చోరీలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ సమావేశంలో పెనుకొండ సిఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులకు రివార్డులు అందజేస్తున్న ఎస్పీ

విద్యుత్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడు మృతి

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలోని బూదిలి వాండ్లపల్లిలో విద్యుత్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడు మంజునాథ్ (20) మృతిచెందాడు. మంజునాథ్ బేల్దారు పని చేసేవాడు. ఇంటి నిర్మాణం చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి క్రిందికి పడడంతో తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మంజునాథ్ ఇదే మండలంలోని సిరిగా వాండ్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి. ఈ మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోనిచంద్రబాబునగర్ కు చెందిన పల్లవి(23) అనే యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఎంబిఎ చదివిన పల్లవి తనకు సరైన ఉద్యోగం రాలేదని అసంతృప్తితో ఉండేది. ఈ మధ్య కాలంలో కడుపునొప్పితో బాధపడుతూ ఉండేది. ఈ నేపథ్యంలో మనస్థాపానికి గురైన పల్లవి శుక్రవారం తన ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తల్లి కుళ్లాయమ్మ బాయి తెలిపారు. పల్లవికి ఒక తమ్ముడు ఉన్నాడు పల్లవి తల్లిదండ్రులు దినకూలీలు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలకేంద్రం సమీపంలో హైవేలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అయ్యాయి. అనంతపురానికి చెందిన హనుమంత రెడ్డి శుక్రవారం ఉదయం అనంతపురం నుండి కదిరికి స్కూటీ పై వెళ్తుండగా ముదిగుబ్బ సమీపంలో హైవే పై అదుపు తప్పి కిందికి పడ్డాడు. ఈ ప్రమాదంలో గాయపడిన హనుమంతరెడ్డిని 108 సాయంతో ఆసుపత్రికి తరలించారు.

ఆస్తి వివాదంపై కేసు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఆస్తి వివాదంలో అసభ్యంగా దూషించి అంతూ చూస్తానని బెదిరించారని ప్రకాశం జిల్లా, కందుకూరు కి చెందిన కోటేశ్వరరావు భార్య బొమ్మిశెట్టి నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కోటేశ్వర రావుకు ఆయన సోదరుడు రామకోటేశ్వర రావు కి మధ్య కదిరి టౌన్‌లో ఉన్న ఆస్తి విషయంలో తగాదాలు ఉన్నాయని, ఈ విషయమై బాధితులు కదిరి టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేసు నమోదును మనసులో ఉంచుకొని కోటేశ్వర రావు పోలీస్ స్టేషన్ నుండి ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో బొమ్మిశెట్టి రామకోటేశ్వరరావు, ఆమె భార్య జయలక్ష్మి, వారి కుమారుడు పవన్ కుమార్ కలసి తనను తన భర్తను అసభ్యకరంగా దూషించి మరోసారి ఆస్తి విషయం గురించి అడిగితే అంతు చూస్తామని బెదిరించినారని బాధితురాలు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముదిగుబ్బలో చోరీ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ముదిగుబ్బ లోని నాయిబ్రాహ్మణ కాలనీకి చెందిన కొరవపల్లి రమణమ్మ అనే మహిళ ఇంటిలో గురువారం రాత్రి చోరీ జరిగిందని బాధితురాలు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రమణమ్మ గురువారం రాత్రి తన ఇంటికి తాళం వేసి ప్రక్కన ఇంటిలో ఉన్న తన అక్క వారింట్లో నిద్రపోయిందన్నారు. అది గమనించిన దుండగులు రమణమ్మ ఇంటి తాళం పగులకొట్టి ఇంటిలోని బీరువాలోనిరూ. 1.36 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తపాలా కార్యాలయంలో....

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కదిరి మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుల గ్రామంలో ఉన్న తపాలా కార్యాలయంలో దొంగతనం జరిగినట్లు పోస్ట్‌మ్యాన్ వంశీకృష్ణ ఫిర్యాదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ప్రధాన రహదారిలో గల పోస్ట్ ఆఫీస్‌లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి తాళం తొలగించి, లాకర్ లో ఉన్న సుమారు లక్ష ఇరవై నాలుగు వేల ఐదు వందల రూపాయలు నగదును తీసుకొని పోయినట్లు పోస్ట్ మాన్ ఫిర్యాదులో తెలిపినట్లు సిఐ చెప్పారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ శివనారాయణ స్వామి, సిఐ నారాయణరెడ్డి పరిశీలించారు.

మహిళపై వ్యక్తి అసభ్య ప్రవర్తన

ప్రజాశక్తి - కదిరి అర్బన్

మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుల గ్రామంలో బ్రాహ్మణ వీధికి చెందిన మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన అట్టుబాయ బాబ్జాన్ పై కేసు నమోదు చేసినట్లు సిఐ నారాయణరెడ్డి తెలిపారు. తన ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించి తనపై అసభ్యకరంగా వ్యవహరించారని ఆమె తన ఫిర్యాదులో తెలిపినట్లు సిఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తామని సిఐ తెలిపారు.